రాయచోటి ఎంపిపి-2 వైసిపి కైవసం

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి మండల 2వ ఉపాధ్యక్షురాలు పదవిని వైసిపి కైవసం చేసుకుంది. గురువారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎన్నికల అధికారి లక్ష్మీపతి, ఎంపిడిఒ వెంకటేష్ మండల ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికకు హాజరు కావాల్సిన వారిలో మొత్తం పది మంది ఉండగా అందులో ఇద్దరు చనిపోయారు. మరో ముగ్గురు గైర్హా జరు అయ్యారు. మిగిలిన ఐదుగురు ఎంపిటిసి సభ్యులు ఎన్నికకు హాజరయ్యారు. ఈ క్రమం లో శిబ్యాల-1 ఎంపిటిసి బోడిరెడ్డి నాగసుబ్బమ్మ పేరును యండపల్లి ఎంపిటిసి సైకం జైపాల్‌రెడ్డి 2వ ఉపాధ్యక్షురాలుగా ప్రతిపాదించారు. శిబ్యాల-2 ఎంపిటిసి పల్లపు రాజమ్మ ప్రతిపాదనను బలపరిచారు. మరో నామినేషన్ రాకపోవడంతో ఎన్నికల అధికారులు బోడిరెడ్డి నాగసుబ్బమ్మను వైసిపి మద్దతులాలుగా ధ్రువీకరించారు. రాయచోటి మండల రెండవ ఉపాధ్యక్షురాలుగా ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఈమేరకు అధికారులు బోడిరెడ్డి నాగ సుబ్బమ్మను ఎన్నుకున్నట్లు ఆమెకు ధ్రువీకరణ పత్రాన్ని అందించారు.

జడ్‌పి చైర్మన్‌గా రామగోవిందరెడ్డి

- ప్రకటించిన ఎన్నికల అధికారి శ్రీధర్
- అట్టహాసంగా ప్రమాణ స్వీకారం

రామగోవిందరెడ్డికి ఎన్నిక పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి శ్రీధర్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉమ్మడి కడప జిల్లా జడ్‌పి చైర్మన్‌గా వైసిపికి చెందిన బ్రహ్మం గారిమఠం జడ్‌పిటిసి సభ్యులు రామగోవిందరెడ్డి ఎన్నికయ్యారు. గురువారం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ ఎన్నిక ప్రత్యేక సమావేశం కడప కలెక్టర్ శ్రీధర్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జడ్‌పి సిఇఒ ఓబులమ్మ హాజరయ్యారు. ముందుగా కలెక్టర్ కడప జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పదవికి అభ్యర్థిని ప్రతిపాదించాలని జడ్‌పిటిసి సభ్యులను కోరడంతో పోరుమామిళ్ల జడ్‌పిటిసి సభ్యులు ముత్యాల ప్రసాద్ చెన్నయ్య, వేముల జడ్‌పిటిసి కోకటం వెంకట బయపురెడ్డి బి.మఠం జడ్‌పిటిసి సభ్యులు ముత్యాల రామ గోవిందరెడ్డి పేరును ప్రతిపాదించి, ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. తరువాత ఏ ఒక్క అభ్యర్థి పేరును కూడా ప్రాదేశిక సభ్యులు ప్రతిపాదించకపోవడం, వైసిపికి చెందిన ప్రాదేశిక సభ్యుల కోరం కూడా సరిపడా ఉండడంతో బి.మఠం మండలానికి చెందిన ముత్యాల రామ గోవిందరెడ్డిని జిల్లా పరిషత్ చైర్మన్‌గా జిల్లా ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం వైఎస్‌ఆర్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా ముత్యాల రామ గోవింద రెడ్డితో కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు ఉదయం 10 గంటలకు ముత్యాల రామ గోవిందరెడ్డి జడ్‌పి సిఇఒ ఓబులమ్మకు నామినేషన్ పత్రాలు సమర్పించారు.

జడ్‌పి చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న రామగోవిందరెడ్డి

ఆయన వెంట కడప ఎంపీ అవినాష్ రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధా, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఆర్.వి.రమేష్ యాదవ్, యం .వి.రామ చంద్రారెడ్డి, డి.సి. గోవింద రెడ్డి, ఇతర నాయకులున్నారు. జిల్లాలో మొత్తం 50 మంది జడ్‌పిటిసి సభ్యులుండగా ఇందులో పులివెందుల, ఒంటిమిట్ట స్థానాలు ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం జిల్లా పరిషత్‌లో 48 మంది జడ్‌పిటిసి సభ్యులున్నారు. వారిలో గోపవరం మండల జడ్‌పిటిసి జయరామిరెడ్డి మాత్రమే తెలుగుదేశం పార్టీ నుంచి ఎన్నికయ్యారు. మిగతా అందరూ వైసిపి నుంచి ఎన్నికైన వారే ఉండడంతో చైర్మన్ ఎన్నిక లాంఛన ప్రాయంగా ముగిసింది. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులు, జిల్లా పరిషత్ కో - ఆప్షన్స్ సభ్యులు, జడ్‌పిటిసి సభ్యులు పాల్గొన్నారు.

కోదండరాముడి

బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

టిటిడి అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్యచౌదరి

ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

శ్రీకోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయని టిటిడి అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరి వెల్లడించారు. ప్రస్తుతం ఒంటిమిట్టలో జరుగుతున్న పనులను టిటిడి జెఇఒ వీరబ్రహ్మంతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ 5 నుండి 15 వరకు నిర్వహించబోయే శ్రీకోదండరామస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు 5న అంకురార్పణ ఉంటుందని తెలిపారు. 6న శ్రీరామనవమి 6వ 11న శ్రీసీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారని చెప్పారు. భక్తుల రద్దీ, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టిటిడిలోని వివిధ విభాగాల అధికారులు ప్రణాళిక బద్ధంగా పనులు చేస్తున్నారని వివరించారు. 2015 నుంచి ఒంటిమిట్టలో శ్రీ సీతారాముల కల్యాణం ప్రభుత్వ పండుగగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తోందని, ఏప్రిల్ 11న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరుపున శ్రీసీతారాముల వారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారన్నారు. కల్యాణ వేదిక వద్ద భక్తుల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలలోను, ఆలయ పరిసర ప్రాంతాలలో మరింతగా ఆకట్టుకునేలా పుష్పాలంకరణ, విద్యుత్ అలంకరణలు, భక్తులు వీక్షించేలా ఎల్ఇడి స్క్రీన్‌లను, అన్నప్రసాదాల పంపిణీ ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. భక్తులకు స్వామివారి తలంబ్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, తాగునీరు, మజ్జిగ అందించేందుకు వీలుగా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలియజేశారు. అంతకుముందు అదనపు ఇఒకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. తర్వాత ముఖ్యమంత్రి వచ్చే మార్గాలను, ఆలయ పరిసరాలు, కల్యాణవేదిక, క్యూలైన్లు, భక్తులకు ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సిఇ సత్యనారాయణ, ఎస్ఇ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, ట్రాన్స్ ఫోర్ట్ జిఎం శేషా రెడ్డి, విజిఒలు రామ్‌కుమార్, సదాలక్ష్మి, అన్నప్రసాద విభాగం ప్రత్యేకాధికారి జి.వి.ఎల్.ఎన్. శాస్త్రి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వైద్య రంగానికి నూతన ఊపిరి క్రిటికల్ కేర్

- బోనమల ఖాదర్‌వలి

మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని టిడిపి పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్‌వలి పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆయుష్మన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్టక్చర్ మిషన్ పథకంలో భాగంగా రాష్ట్రానికి 5 క్రిటికల్ కేర్ బ్లాక్ మంజూరు అయ్యాయని అన్నారు. అందులో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి మంజూరు కావడంతో మంత్రి కృషి ఉందని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో 50 బెడ్లతో అత్యాధునిక క్రిటికల్ కేర్ ఐసియు విభాగం రూ.23.75 కోట్లతో ఏర్పాటు కావడం ప్రజల ఆరోగ్యానికి గొప్ప వరమని అన్నారు. ప్రమాదాలకు గురైన వారు, తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న వారికి ఈ క్రిటికల్ కేర్‌లో మెరుగైన చికిత్సలు అంద నున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కొట్టే చలపతి, మాజీ కౌన్సిలర్ బిఎంకె రషీద్, జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు యూసూప్, అలీఖాన్ పాల్గొన్నారు.

నేడు మంత్రి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు రాయచోటి పట్టణంలోని సుండుపల్లిరోడ్డు నందలి పండ్ల మార్కెట్ వద్ద శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు టిడిపి పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్‌వలి తెలిపారు. ఈ ఇఫ్తార్ విందుకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి ముస్లిము సోదరులు రావాలని ఆయన కోరారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

మాట్లాడుతున్న శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, కోశాధికారి టి.హరిశర్మ పేర్కొన్నారు. గురువారం తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ (కెప్టన్ల) డ్రైవర్ల సమావేశం మదనపల్లి ఆసుపత్రి వద్ద నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలు చాలా తీవ్రంగా ఉన్నాయని అన్నారు. వారికి సరైన వేతనాలు ఇవ్వడం లేదని, వారి సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ల అందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మార్చి 31న అరబిందో సంస్థ కాంట్రాక్ట్ రద్దు కావడంతో మరో కాంట్రాక్ట్ వస్తే పాత వారినే కొనసాగిస్తూ కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రూ. 7,850 జీతంలో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. డ్రైవర్లందరికీ కనీస వేతనం అమలు చేయాలని, పిఎఫ్ యాజమాన్యం తరపున చెల్లించాలని, వాహనాలు మరమ్మతులను ప్రభుత్వమే చేయించాలని, ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కోరారు. నిత్యావసర సరుకుల ధరలు, ఇళ్ల అద్దెలు, స్కూల్ ఫీజులు, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో బతకలేకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా అనుభవం కలిగిన డ్రైవర్లు డెలివరీ అయిన మహిళలను సురక్షితంగా తీసుకెళుతున్నారని అటువంటి వారిని తొలగించి ఊరుకోదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగరాజు, తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కృష్ణ, ఉపాధ్యక్షులు గంగాధర్, డ్రైవర్లు పృథ్వీరాజ్, ముఖేష్, శివకుమార్ పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

మదనపల్లె క్రైస్తవ ఐక్యవేదిక డిమాండ్

మాట్లాడుతున్న సునీల్ వరకుమార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

క్రైస్తవ బోధకుడు, పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపిం చాలని మదనపల్లె క్రైస్తవ వేదిక డిమాండ్ చేసింది. గురువారం స్థానిక సిఎస్ఐ జెసిఎం కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా సిఎస్ఐజెసిఎం చర్చ్ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ సునీల్ వరకుమార్ మాట్లాడుతూ ఈనెల 24న విజయవాడ నుంచి రాజమండ్రికి ద్విచక్రవాహనంలో వెళ్తున్న పాస్టర్ ప్రవీణ్ పగడాల మార్గమధ్యంలో దుర్మరణం పాలైన సంగతి తెలిసిందేనన్నారు. ఆయన ప్రమాదవశాత్తు చనిపోలేదని, అతని మృతిపై ఎన్నో అనుమానాలున్నట్లు పలు ప్రసార మాధ్య మాల ద్వారా తెలుస్తోందన్నారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడన్న ఆరోప ణల నేప థ్యంలో ఆయన మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించి ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదు కోవా లన్నారు. ప్రభుత్వం ఈ కేసును సీరియస్‌గా తీసుకొని లోతైన దర్యాప్తు చేసి ఇంతటి ఘాతు కానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రవీణ్ మృతికి సంతాపాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు అబ్రహామ్, మేరి, నోయల్, మ్యా థ్యూస్, డేవిడ్ రాజు, జాన్ అతిశం, పాల్ వెంకట్రమణ, శ్యామ్ ఆర్థర్, సుధాకర్, లేవి చర్చి పెద్దలు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి : సిపిఎం

క్రైస్తవ బోధకులు పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఈనెల 25న రాజమండ్రిలో క్రైస్తవ బోధకులు పగడాల ప్రవీణ్ మృతి చెందిన ఘట నపై ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయని అన్నారు. ప్రవీణ్ క్రైస్తవ మత ప్రచారం చేస్తున్నాడనే కారణంతో కొంతమంది దుండగులు ఆయన మృతికి కారణమయ్యారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని వివరించారు. గతంలో జరిగిన కొన్ని ఘటనలు, తనను హత్య చేయొచ్చని ప్రవీణ్ వ్యక్తం చేసిన అనుమానం దీనికి బలమైన ఆధారాలు చూపుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా న్యాయవాదుల సంఘం ఎన్నిక



పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్, రామస్వామిరెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు న్యాయవాదుల సంఘం ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. స్థానిక బార్ అసోసియేషన్ కు ఈనెల 17న నామినేషన్లు జరిగాయి. 20న సంఘం కోశాధికారిగా పి.షౌకత్‌అలీ, సంయుక్త కార్యదర్శిగా వై.నాగసుధాకర్ రెడ్డి, క్రీడా విభాగం కార్యదర్శిగా ఎస్.నిరంజన్‌కుమార్, గ్రంథాలయ కార్యదర్శిగా పూజారి ఎల్లప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవుల కోసం ఇద్దరేసి పోటీ పడుతుండడంతో పోలింగ్ అనివార్యమైంది. టి.నిరంజన్ ఎన్నికల చీఫ్‌గా వ్యవహరిస్తూ గురువారం న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. బార్ అసోసియేషన్ లో మొత్తం 76 మంది సభ్యులుండగా వారిలో 74 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్ష స్థానానికి పోటీ చేసిన బిసి పురుషోత్తంరెడ్డికి 45 ఓట్లు, ఎస్ఎండి రఫీ అన్సారీకి 27 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన కె.రామస్వామిరెడ్డికి 42 ఓట్లు, తెనాలి రామ సుబ్రమణ్యంకు 29 ఓట్లు దక్కాయి. ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన ఆర్. చంద్రశేఖర్‌కు 46 ఓట్లు, ఎ.నరసింహారెడ్డికి 26 ఓట్లు లభించాయి. కొత్తగా ఎన్నికైన అధ్యక్షులు బిసి పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు కె.రామస్వామి రెడ్డిలకు న్యాయవాదుల సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

'మిట్స్'లో ఎఐపై అవగాహన

మాట్లాడుతున్న కుమార్ రాజమణి

ప్రజాశక్తి-మదనపల్లె : మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం వారు డీప్ లెర్నింగ్(ఎఐ) ఇన్ అగ్రిటెక్ అండ్ హెల్త్‌కేర్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెంగళూరులోని క్రాపిన్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ కుమార్ రాజమణి పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ డీప్ లెర్నింగ్‌పై పోస్ట్‌డాక్టోరల్ పరిశోధన కేంద్రాలు ప్రత్యేకంగా అటెన్షన్ మెకానిజమ్‌లను ఉపయోగించి మెడికల్ ఇమేజ్ సెగ్మెంటేషన్ కోసం అధునాతన ఆర్కిటెక్చర్‌లు పై విద్యార్థులకు అవగాహన పెంచారని అన్నారు. వివిధ డీప్ లెర్నింగ్ అప్లికేషన్‌లపై తన విస్తృత నైపుణ్యాన్ని వివరించారు. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్, నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ పద్మ పాల్గొన్నారు.

జిల్లా ఫ్యాప్టో చైర్మన్‌గా జాబీర్ ఏకగ్రీవం

ప్రజాశక్తి- రాయచోటి

ఎన్నికైన నూతన కార్యవర్గం

జిల్లా ఫ్యాప్టో చైర్మన్‌గా జాబీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని ఎస్‌టియు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఫ్యాప్టో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రూటా రాష్ట్ర నాయకులు ఇక్బాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఫ్యాప్టో కొత్త కమిటీని ఎన్ను కున్నారు. కమిటీ జిల్లా చైర్మన్‌గా షేక్. జాబీర్, సెక్రటరీ జనరల్‌గా పి. గఫార్ ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. వీరితో పాటు కో - చైర్మన్లుగా ఆర్ .రవిశంకర్, ఎస్. రామకృష్ణ ,ఏ. శివారెడ్డి, సయ్యద్, సిబాతు ర్రహ్మాన్, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా పి. మధుసూదన్, ఏ. హరిబాబు, వి. మహమ్మద్, ఇలియాస్ కార్యదర్శులుగా కె. శ్రీనివాసులు, ఎస్. రెడ్డిప్ప రెడ్డి, టి. సుధాకర్ నాయుడు, జిల్లా కోశాధికారిగా ఎస్. జాఫరుద్దీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్, సెక్రటరీ మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్య సంఘ నాయకత్వానికి ఉపాధ్యాయుల హక్కుల కోసం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఫ్యాప్టో రాష్ట్ర శాఖ ఇచ్చే కార్యాచరణను విజయవంతం చేయడానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

మానిటరింగ్ కమిటీకి దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె డివిజన్ స్థాయి విజిలెన్స్ అండ్ మానటరింగ్ నూతన కమిటీ దరఖాస్తు చెసుకోవాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన ఇద్దరు, ఇతర గ్రూపులకు చెందిన ఇద్దరు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అసక్తిగల అభ్యర్థులు కార్యాలయ పనిదినములలో తమ దరఖాస్తులను సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందించాలని తెలిపారు.

మూగజీవాల దాహార్తి తీర్చుదాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వేసవికాలంలో నీటి చుక్క కోసం అల్లాడిపోయే మూగజీవాల కోసం అందరూ కలిసినడుద్దామని హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్దిక్ పిలుపునిచ్చారు. స్థానిక హెల్పింగ్ మైండ్స్ కార్యాలయంలో గురువారం వాటర్ బౌల్స్‌ను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా అబూబకర్ సిద్దిక్ మాట్లాడుతూ మానవ మాత్రులమైన మనమే వేసవిలో కాసిన్ని నీళ్లు ఎక్కడ దొరుకుతాయా అని ఆశతో వెదుకుతుంటామని, ఎప్పటికప్పుడు ఉష్ణతాపాన్ని తీర్చుకునేందుకు ఏదో రూపంలో నీటిని శరీరానికి అందిస్తుంటామని అన్నారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చాలా చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారని, మరి మూగజీవాల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. చుక్కనీటి కోసం మైళ్ల దూరం ప్రయాణిస్తూ ప్రాణాలు కోల్పోతున్నాయని, పక్షి జాతుల్లో కొన్ని అంతరించి పోవడానికి వేసవి కూడా ఒక కారణమని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మండుటెండల్లో విహరించే పక్షులు, మూగజీవాల దాహార్తి తీర్చడానికి మట్టితో తయారు చేయబడిన మట్టికుండలు, సిమెంటు తొట్టెలు తమ సంస్థ కార్యాలయంలో ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. వీటిని మూగజీవాలు విహరించే ప్రదేశాల్లో పెట్టడం వల్ల వర్షపు నీరు నిల్వ ఉండి వాటి దాహార్తి తీరుతాయన్నారు. ఇంకా జంతుప్రేమికులు, పక్షి ప్రేమికులు వీలైతే ఆ బౌల్స్ లో అవకాశం దొరికినప్పుడు నీటితో నింపే అవకాశం ఉంటుందన్నారు. ప్రతీఒక్కరు స్పందిస్తే మూగజీవాల దాహార్తి తీర్చడం సాధ్యపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు దినకర్, పురుషోత్తం, బషీర్, కిరణ్ పాల్గొన్నారు.

నీటి తొట్టెలను పంపిణీ చేస్తున్న హెల్పింగ్ మైండ్స్ సభ్యులు

ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

మధ్యంతర భృతి ప్రకటించాలి

ప్రజాశక్తి-రాయచోటి

ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయి ఉన్న మూడు కరువు బత్యాలలో కనీసం ఒక డిఎని విడుదల చేసి, పిఆర్‌సి కమిషన్‌ను నియమించి నివేదిక వచ్చే లోగా మధ్యంతర భృతిని ప్రకటించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీని వాసరాజు కోరారు. గురువారం పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిని పులివెందులలోని వారి క్యాంప్ కార్యాలయం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉన్న ఆర్థిక పరిస్థితులు, ఇబ్బందులు, గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వలన పేరుకుపోయిన అంశాలు, రూ.25 వేల కోట్ల బకాయిలు ఉన్నప్పటికీ ప్రభుత్వం రూ.7,230 కోట్ల బకాయిలు విడుదల చేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులను కూడా ప్రజలలో భాగంగా గుర్తించాలని, వారి సమస్యలపై కార్యాచరణ సిద్ధం చేసేలా ప్రభుత్వాన్ని ఒప్పించాలని ఎన్‌టిఎ సంఘ నాయకులతో కలిసి విన్నవించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 1 వ తేది నుంచి 5వతేదీ లోపే జీతాలు చెల్లిస్తోందని అన్నారు. పలు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్సీ ని కోరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌టిఎ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రెడ్డిరమేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి సురేష్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ అబ్దుల్ గఫార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణమరాజు, రామసుబ్బన్న, జిల్లా గౌరవాధ్యక్షులు కూరాకు రవీంద్ర, జిల్లా నాయకులు బిసి సుబ్బరాయుడు, ఆర్థిక కార్యదర్శి చలపతిరాజు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వాటర్‌ప్లాంట్

మూతపడిన నీటిశుద్ధి కేంద్రం

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని డి.రాచపల్లి పంచాయతీ పెద్ద మాదిగపల్లెలో ఏర్పాటుచేసిన శుద్ధజలం కేంద్రానికి మోక్షం ఎప్పుడు వస్తుందోనని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో గ్రామంలోని ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు అందించాలని లక్ష్యంతో ఏర్పాటుచేసిన మినరల్ ప్లాంట్ మూతపడింది. నాయకుడు మధుసూదన్‌రెడ్డి సహాయంతో అప్పట్లో వీటిని గ్రామ ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. కేవలం రూ.2లకే 20 లీటర్ల నీటిని అందించాలని ఉద్దేశంతో ఈ ప్లాంట్ నిర్మించారు. అనంతరం దానిని పాలకులు, పట్టించుకున్న పాపాన పోలేదు. అదికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమై పట్టించుకొని తాగునీటి శుద్ధి జలం కేంద్రాన్ని పునః ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. వాటర్ ప్లాంట్ ప్రారంభమైతే దాదాపు 500 కుటుంబాలు తాగునీటికి ఇబ్బందులు ఉండవు చెఉతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇని వివరణ అడగగా పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి తాగనీటికి సమస్య లేకుండా మినరల్ ప్లాంట్‌ను ప్రారంభిస్తామని తెలిపారు.

నవోదయకు ఎంపికైన తీర్థిక

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని స్థానిక శ్రీచైతన్య చిల్డ్రన్స్ అకాడమీలో చదువుతున్న రాపూరి వారిపల్లెకు చెందిన ఆర్.హరినాథ్ రెడ్డి కుమార్తె ఆర్.తీర్థిక 6వ తరగతి ప్రవేశానికి నిర్వహించిన జవహర్ నవోదయ ఎంట్రన్స్ పరీక్ష రాసింది. ఇటీవల విడుదలైన ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించి ఎంపికైంది.ఈ సందర్భంగా తీర్థిక తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ చిన్నతనం నుంచి చదువుపై ఎంతో మక్కువ కలిగి ఉండేదన్నారు. తమ కుమార్తె ఆసక్తిని చూసి జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తు చేయించామని చెప్పారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ఎంతో శ్రద్ధగా విని, పట్టుదలతో చదివి ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చూపి జవహర్ నవోదయకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు.

ఘనంగా రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సినీ హీరో రామ్‌చరణ్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలో నిరుపేదలు, యాచకులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోలాటం హరి, గోపీకృష్ణ మాట్లాడుతూ రామ్‌చరణ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. సిని మాల్లో మెరిసే రామ్‌చరణ్ వ్యక్తిగతంగా చాలా వినయంతో, సంయమనం కలిగిన వ్యక్తిగా పేరు పొందారని, తండ్రి చిరంజీవిని అనుసరించి చాలామంది సినీ కార్మికులకు సహాయం అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో లోకేష్ రాయల్, జనసేన నాయకులు కోలాటం హరి, కత్తి సుబ్బారాయుడు, పాలకూరు శంకర్, మస్తాన్ పాల్గొన్నారు.

'ఉపాధి' ఇంజినీర్‌గా మహేష్‌బాబు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో ఉపాధి హామీ పథకం ఇంజినీర్‌గా మహేష్‌బాబు గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో పెద్దతిప్ప సముద్రం మండలంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ గతంలో పనిచేసిన రామన్న గాలివీడు మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కూలీలకు సకాలంలో కూలీలు కోరిన విధంగా పనులు చూపి జరిగిన పనులకు సకాలంలో కొలతలు తీసి బిల్లులు చెల్లించేందుకు ప్రత్యేక చొరవ చూపుతానని తెలిపారు.

నేడు 'ఆదిత్య'లో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని రంగసముద్రం రోడ్డులో గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ బెంగళూరు, చెన్నై నగరాలలో ప్రసిద్ధిగాంచిన ఆల్ డిజి టెక్నాలజీ కంపెనీ వారిచే ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునని అన్నారు. ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులు సదరు కంపెనీలో టెక్నికల్ సపోర్టరుగా విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఉద్యోగాలు ఎంపికైన వారికి ఇన్సెంటివులతో కలిపి నెలకు రూ.17,500లు వేతనం లభిస్తుందన్నారు. మండలంలో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎస్‌సి, ఎస్‌టి డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత కోచింగ్

ప్రజాశక్తి-రామాపురం

రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి డిఎస్‌సి అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ శాఖ గిరిజన సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మెగా డిఎస్‌సి శిక్షణ కోసం ఉచిత కోచింగ్ ఇస్తుందని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యుడు వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులకు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశం మేరకు విద్యాశాఖ మంత్రి లోకేష్, మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి చొరవతో సాంఘిక సంక్షేమ శాఖ గిరిజన సంక్షేమ శాఖ సంయుక్తంగా కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేశారన్నారని అన్నారు. కోచింగ్ సమయంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రయివేట్ శిక్షణ సంస్థను గుర్తించి వాటి ద్వారా శిక్షణ ఇస్తారన్నారు ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కో-ఆప్షన్ సభ్యుడి ఎన్నిక ఏకగ్రీవం

సయ్యద్‌బాషా

ప్రజాశక్తి-పీలేరు : పీలేరు మండల ప్రజా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడి ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి అమర్నాథరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కో-ఆప్షన్ సభ్యుడి ఉప ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. పీలేరు మండల కోఆప్షన్ సభ్యుడిగా ఉన్న రెడ్డిబాషా అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. మండలానికి జరిగిన కో ఆప్షన్ సభ్యుడి ఉప ఎన్నికలో వైసిపికి చెందిన షేక్ సయ్యద్ బాషను కో-ఆప్షన్ సభ్యుడిగా ఎంపిపి కంభం సతీష్ కుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి హరిత వెంకటరమణ, ఎన్‌వి. చలపతి, ఎంపిటిసిలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎన్నికల అధికారి షేక్. సయ్యద్ బాషాకు ధృవీకరణ పత్రం అందచేసి, కో-ఆప్షన్ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివశంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No: 89/2023

నాయుని శ్రేదేవి, W/o శ్రీనివాసులు, వయస్సు 49 సంII, హిందూ, house wife, D.No:5/102, మైన్ రోడ్డు, చిట్వేలి టౌన్ & పోస్ట్, చిట్వేలి మండలం, అన్నమయ్య జిల్లా.

...వాది

V/s

కోలె సుబ్బారాయుడు, S/o సుబ్బన్న, వయస్సు 51 సంII, హిందూ, వ్యాపారం, S.M.వీధి, శివాలయం వెనుక, చిట్వేలి టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా.

...ప్రతివాది

సమను

వాది ప్రతివాది పైన రిజిస్టర్ మార్టి గేజ్ ను బట్టి దావా దాఖలు చేసియున్నారు. సదరు విషయమై ప్రతివాదికి ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల 04.04.2025వ తేదీన ఉదయం 10:30కు పై కనిన కోర్టులో హాజరై మనవి చేసుకొనవలెను. లేనంతట పరోక్షముగా తీర్మానించబడునని ఖండితముగా తెలుపడమైనది.

//By order of the Court//

నాయుని బాలాజీ,
వాదిపరం అడ్వకేట్,
రాజంపేట.
మొబైల్ :94404 26907.

వార్షిక ప్రణాళికను సిద్ధం చేయాలి :ఎపిఎం

ప్రజాశక్తి-చిట్వేలి

మాట్లాడుతున్న ఎపిఎం చంద్రకళ

స్వయం సహాయక సంఘాలకు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశానుసారం సంవత్సర కాలంలో అవసరమైన ఆర్థికపరమైన వార్షిక ప్రణాళికను త్వరితగతిన పూర్తి చేయాలని ఎపిఎం చంద్రకళ పేర్కొన్నారు. గురువారం ఆమె స్వయం సహాయక కార్యాలయంలో యానిమేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రూపులోని సభ్యులకు సంవత్సర కాలంలో అవసరాల నిమిత్తం ఏ సమయాల్లో వారికి రుణాలు అవసరమో వాటిపై సంఘంలోని గ్రూపు సభ్యులు అందరితో చర్చించే విధంగా ప్రతి ఐదు గ్రూపులకు ఒక సిఆర్‌పిని ఏర్పాటు చేయాలన్నారు. మండలంలోని 841 గ్రూపులకు 35 మంది యానిమేటర్లు కలిసి సిఆర్‌పిలు ఏర్పాటు చేసి ఏప్రిల్ 1 నుంచి 7వ తేదీలోపు గ్రామ సంఘాల వార్షిక ప్రణాళికను సిద్ధం చేయాలని తెలిపారు. మండల సమాఖ్య వార్షిక ప్రణాళిక ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఏ విధంగా అవసరాలకు రుణాలను అందచేయగలమనే అనే నివేదిక జిల్లా అధికారులకు నివేదిక పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో మండల యానిమేటర్లు, సమాఖ్య సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెదురు సాగులో ఎన్నో లాభాలు

వెదురు సాగులో ఎన్నో లాభాలు ఉన్నాయని ఎపిఎం చంద్రకళ అన్నారు. స్వయం సహాయక గ్రూపులోని మహిళా రైతులతో మాట్లాడుతూ వ్యవసాయానికి నిరుపయోగంగా ఉన్న భూములలో సుమారు మండలంలోని 350 మంది రైతులకు ఒక్కో రైతు 30 సెంట్లు పొలంలో 60 వెదురు మొక్కలు నాటుకుంటే నాలుగు సంవత్సరాలలో అధిక లాభాలు ఉంటాయని అన్నారు. బెంగళూరులో 2000 సంవత్సరంలో ఏర్పాటు అయిన ఇండస్ట్రియల్ ఫౌండేషన్ సంస్థ కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏర్పాటయిందని, వారు పొలంలోని మొక్కల పెరుగుదలను గుర్తించి ఎఫ్ఎస్సి సర్టిఫికెట్ మంజూరు చేసి సర్టిఫికెట్ పొందిన తదుపరి రూ.7500 ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వెదురు మొక్క వల్ల ఆక్సిజన్ అధికంగా విడుదల కావడమే కాకుండా కార్బన్ డైయాక్సైడ్‌ను అధిక శాతం ఒక మీటర్ లోతులో గల వేర్ల భాగంలోని నిల్వ ఉంచి పర్యావరణానికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. నాలుగేళ్లకు 30 సెంట్లు భూమికి సుమారు రూ.50 నుంచి రూ.60 వేల దిగుబడి వస్తుందని అన్నారు. ఆసక్తి కలిగిన రైతులు పట్టాదారు పాసుపుస్తకంతో స్వయం సహాయక సంఘాల కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం :ఎమ్మెల్యే

సూరీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉండి ఆదుకుంటామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని నక్కలదిన్నెలో ఇటీవల మృతి చెందిన వైసిపి యువ నాయకులు అంకిశెట్టిపల్లి మాజీ ఉపసర్పంచ్ సూరీ కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట వైసిపి నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, సర్పంచ్ శరత్ రెడ్డి, వైస్ ఎంపిపి రమణ, నరీ బాబాయ్, మధుసూదన్‌రెడ్డి, కిషోర్, రమణారెడ్డి, అశోక్, కౌశిక్ రాజు, పూర్ణ, మహేష్ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర

బి.కొత్తకోట : మండలంలోని కొండకింద కురవపల్లిలో గంగ జాతర గురువారం ఘనంగా జరిగింది. వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు సాంబశివ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి జాతరలో పాల్గొన్నారు. ఆనంతరం సాంబశివ నివాసంలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొండకింద కురవపల్లిలో ప్రతి ఏడాది గంగ జాతరను ఎంతో ఘనంగా నిర్వహించడం మానవాయితీ అన్నారు. అదే తరహాలో ఈ ఏడాది సైతం గంగ జాతరను బ్రహ్మాండంగా నిర్వహించారని కితాబునిచ్చారు. కార్యక్రమంలో నియోజవర్గం బూత్ కమిటీ అధ్యక్షుడు రెడ్డిహరి, వైసిపి పట్టణ అధ్యక్షుడు సి.ఆర్.చిన్ని కృష్ణ, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయుబ్‌బాషా, ఆర్.సి ఈశ్వర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలి : పీడీ

ప్రజాశక్తి- కలకడ

లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ సాంబశివయ్య

ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ సాంబశివయ్య పేర్కొన్నారు. మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ సచివాలయం పరిధిలో ఉన్న మాదిగపల్లి వద్ద నిర్మిస్తున్న హౌసింగ్ లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాటాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు చెందిన నిరుపేదలకు గృహ నిర్మాణాలు చేపట్టేందుకు అదనంగా రూ.50 వేలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. మంజూరైన 50వేల రూపాయలను దుర్వినియోగం చేసుకోకుండా, గృహ నిర్మాణాలకు వినియోగించుకుని ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. రూ.50వేలు లబ్ధిదారుల అకౌంట్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. హౌసింగ్ సిబ్బంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టేందుకు వారికి సహకరించి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. అనంతరం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేసుకొని తగు సూచనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ నాగముని నాయక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చరిస్మాంజలి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వేలంలో పంచాయతీకి రూ.54 లక్షల ఆదాయం

వేలంపాట నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ పంచాయతీకి గురువారం నిర్వహించిన వేలం పాటల ద్వారా రూ.54,03,900 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వేలంపాటలను మదనపల్లి డిఎల్‌పిఒ నాగరాజా ఆధ్వర్యంలో సర్పంచ్ ప్యారిజాన్ అధ్యక్షతన వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం పాటలలో వారపు సంత ద్వారా రూ.18.20 లక్షలకు పాట పాడి శ్రీహరి నాయుడు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. దినసరి టమోటా మార్కెట్‌ను నసీబ్ జాన్ రూ.31.50లక్షలకు దక్కించుకున్నట్లు తెలిపారు. బస్టాండు గేటును రూ.1.75లక్షలకు సయ్యద్‌సాబ్‌వలి, జంతువు వధశాలను మునాఫ్ రూ.2,100కుపాటు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. పంచాయతీ గదులలో రెండవ గదిని బాబులు, మూడవ గదిని మాసూం సాహెబ్ సంవత్సరానికి ఒక్కొక్క గదికి రూ.1,28,400లకు పాట పాడి తమ సొంతం చేసుకున్నారని అన్నారు. మొదట గది వేలం పాట వాయిదా పడినట్లు తెలిపారు. వేలంపాటలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిఐ గురునాథ , ఎస్ఐ రామాంజనేయులు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మహమ్మద్ రియాజుద్దీన్, వేలంపాటదారులు, కార్యాలయసిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య వేలంపాట

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ బహిరంగ వేలం పాటలను పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంతంగా నిర్వహించారు. గురువారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో మునుపెన్నడూ లేని విధంగా వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, ప్రయివేట్ బస్టాండు, జంతువధ శాలలకు బహిరంగ వేలం పాటలను అత్యంత పారదర్శకంగా, సిసి కెమెరాల పర్యవేక్షణలో మదనపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజ, ఇఆర్‌ఆర్‌డి లతీఫ్ ఖాన్, ఇఒ వై.గురుమోహన్, సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాషా ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు పీలేరు పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పీలేరు మేజర్ పంచాయతీకి వేలం పాటల ద్వారా ఆశించిన మేరకు ఆదాయం సమకూరింది. ఈ ఏడాదికి వారపు సంత వేలంలో రూ.28,.25.000లు, దినసరి కూరగాయల మార్కెట్ రూ.5,55,000లు, ప్రయివేట్ బస్టాండు రూ.6,02.000లు, జంతువధ శాల రూ.3,02,500ల ఆదాయం లభించిందని డిఎల్‌పిఒ అన్నారు. ఈ వేలం పాట సిఐ యుగంధర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌తో వాగ్వివాదం చేస్తున్న నీలిపల్లె గ్రామస్తులు

విద్యుత్ పనులు అడ్డగింత

ప్రజాశక్తి - నందలూరు

మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ నుంచి నీలిపల్లెకు వెళ్లే దారిలో నిర్వహిస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి ముందు సింగిల్ ఫేస్ విద్యుత్తు లైన్ ఉండేదని, ప్రస్తుతం త్రీఫేస్ విద్యుత్ పనులను విద్యుత్ అధికారుల ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ మొదలు పెట్టడం జరిగిందని అన్నారు. కాంట్రాక్టర్ కొద్దిగా దూరం త్రీఫేస్ లైన్ లాగి మధ్యలో సింగల్ ఫేస్ లాగడం మొదలు పెట్టడంతో తాము అడ్డుకోవడం జరిగిందని అన్నారు. ఇది గాక గ్రామానికి వెళ్లే దారిలో దాదాపు 50 ఏళ్లకు పైగా వయసు గల వృక్షాలను విద్యుత్ లైన్ ఏర్పాటుకు అనుకూలంగా తొలగించవలసిన చెట్లను ఇష్టానుసారంగా నరికి వేయడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ చెట్ల వల్ల గ్రామానికి వెళ్లే దారిలో పాదచారులకు నీడ సౌకర్యం ఉండేదని అన్నారు. చెట్లను నరికేందుకు అటు రెవెన్యూ, ఆర్‌అండ్‌బి అధికారుల నుంచి ఎటువంటి అనుమతి లేకుండా పనులు చేపట్టారని ఆరోపించారు. చివరకు కాంట్రాక్టర్ త్రీఫేస్ లైన్ లాగేందుకు ఒప్పుకోవడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

ఇఫ్తార్ విందులో మంత్రి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని హసనాపురం పంచాయతీ మైనార్టీ నాయకులు గురువారం బడే రాత్రి సందర్భంగా ఇచ్చిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం పవిత్ర మాసం అని ముస్లిం సోదరులు కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలో హిందూ, ముస్లింలు సోదరుల కలిసిమెలిసి పండుగ జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. మతసామరస్యానికి సామరస్యానికి ప్రతికగా నిలుస్తున్నారని అన్నారు. ముస్లిముల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. మైనార్టీలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేష్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి నాగ సుబ్బారెడ్డి, సురేందర్‌రెడ్డి, చంద్రమౌళి, మైనారిటీ నాయకులు ఖాదర్ భాషా, మహమ్మద్‌బాషా, అహ్మద్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో మంత్రికి తీపి తినిపిస్తున్న ముస్లిము సోదరులు

పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్ఐ లోకేష్‌రెడ్డి

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

పోలీసులు విధి నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. గురువారం పోలీసులతో సమీక్షించారు. పోలీసులు ప్రజలతో మమేకమై ఫిర్యాదుదారులకు సకాలంలో న్యాయం చేసేందుకు కృషి చేయాలఎని తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం అందినప్పుడు సత్వరమే స్పందించాలన్నారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ మహేశ్వరరావు, పోలీసులు పాల్గొన్నారు.

ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా యోబు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి ఎంపిక చేశారని ఉప్పలపాటి యోబు తెలిపారు. ఆ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నియమించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నానని తెలిపారు. గతంలో వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించారని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షులు రవీంద్ర నాథ్‌రెడ్డికి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డికి, వైసిపి మాజీ ఎమ్మెల్యేలకు, నేతలకు ధన్యవాదాలు తెలిపారు. చిత్తశుద్ధితో పని చేసి పార్టీ అభివృద్ధిలో భాగస్వాములవుతానని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు పట్టణం కడప ప్రధాన రోడ్డుపెన పెద్ద మసీదుకు ఎదురుగా తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ విద్యుత్ అధికారులను కోరారు. ఆ మేరకు గురువారం రైతు సేవాసమితి మైదుకూరు పట్టణ అధ్యక్షుడు కె.రామ్మోహన్ ఆధ్వర్యంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎవి రమణ మాట్లాడుతూ ప్రజలు ప్రమాదానికి గురికాకముందే విద్యుత్‌శాఖ అధికారులు తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పిండి మిషన్ సుబ్బరాయుడు, మూలె రామాంజనేయరెడ్డి, షామీర్‌బాషా, సైమన్, జేమ్స్ పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్ : రంజాన్ పండుగ సందర్భంగా భాగంగా నియోజకవర్గం లో ఉన్న పేదలకు గురువారం వైసిపి మైనార్టీ నాయకులు బేపారి మహ మ్మద్‌ఖాన్ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులకు అత్యంత పవిత్రమైన నెల రంజాన్ నెల అని క్రమశిక్షణ, దాతృత్వం, ఆధ్యాత్మిక చింతన మూడింటి కలయికే రంజాన్ అని అన్నారు. ఈ నెలలో అత్యంత నిష్టతతో కఠినమైన ఉపవాసాలు ఆచరిస్తారని అన్నారు. వందల మందికి దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె :మండలంలోని ఆర్జీయూకేటీ పరిధిలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో చదువుతున్న 9 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూల్లో ఎంపి కైనట్లు ఆర్కేవ్యాలీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. ఎంపికైన విద్యా ర్థులను గురువారం ఆయన అభినందించారు. హైదరాబాద్‌కు చెందిన పోసిడెక్స్ కంపెనీ ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలు నిర్వ హించినట్లు తెలి పారు. సిఎస్ఈ ఇంజినీరింగ్-4 చదువుతున్న 9 మంది విద్యా ర్థులు ఎంపి కయ్యారు. వీరికి ఏడాదికి రూ.6 లక్షల ప్యాకేజీ ఇవ్వడం సంతోషంగా ఉంద న్నారు. విద్యార్థులను పరిపాలన అధికారి డాక్టర్ పెనుగొండ రవికుమార్, ప్లేస్ మెంట్ కో-ఆర్డినేటర్ వినోద్, ప్లేస్‌మెంట్ అధికారి సుందర్ అభినందించారు.

క్రైం కార్నర్

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని చిప్పిలిలో యువకులపై దాడి చేసి హత్యా యత్నంకు పాల్పడిన లడ్డు అలియాస్ మహమ్మద్ రఫీని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల మేరకు.. జంగాలపల్లికి చెందిన అదికేశవ, చరణ్, సుమంత్ లను ఈనెల 24రాత్రి చిప్పిలిలో మహమ్మద్ రఫీ బండరాళ్లతో దాడి చేయడంతో ఆది కేశవ అనే యువకుడు తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లాడని తెలిపారు. చరణ్, సుమన్‌కు గాయపడటంతో కేసు నమోదు చేశామన్నారు. హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడు మహ్మద్ రఫిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

పోక్సో కేసులో నిందితులు..

ప్రజాశక్తి-కలికిరి

పోక్సో కేసులు నిందితులను అరెస్టు చేసినట్లు అప్ గ్రేడ్ సిఐ రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గడి గ్రామంలో వైసిపి జుబేర్ అహ్మద్ నాయకుడు కుమారుడు జునైద్ అహ్మద్ రొంపిచర్ల మండలానికి చెందిన ఓ యువతి గడి గ్రామంలోని అమ్మమ్మ ఇంట్లో ఉంటూ వాల్మీకిపురం జూనియర్ కళాశాలలో చదువుతుందని అన్నారు. జునేద్ ప్రేమ పేరుతో ఆమెను లొంగదీసుకుని పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసినట్లు జనవరి 25న బాధితురాలు అమ్మమ్మ, బంధువులు కలికిరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారని అన్నారు. నిందితుడు జూనెద్ ఉపయోగించిన వాహనాన్ని దాచిపెట్టి పరారయ్యారని తెలిపారు. పరారీలో ఉన్న జుబేర్, బిలాల్, నూరుల్లా, మునీర్‌ను అరెస్టు చేసినట్లు రాయచోటి ఇన్‌ఛార్జి ఎస్‌జిపిఒ కొండయ్య తెలిపారు. నిందితులను వాల్మీకిపురం కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

చెట్టుపై నుంచి పడి కూలీకి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కొబ్బరి చెట్టు ఎక్కి కొబ్బరి కాయలు కోస్తుండగా కింద పడిన కూలీ తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పోతపోలు పంచాయతీ, కురవపల్లికి చెందిన రాజ్‌కుమార్ అబ్బగొంది గ్రామానికి కూలి పనులకు వెళ్లాడు. కొబ్బరి చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా, కిందపడి కాళ్లు, చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన గురువారం తంబళ్లపల్లెలో జరిగింది. కుటుంబీకుల కథనం మేరకు వివరాలు.. తంబళ్లపల్లె దళితవాడకు చెందిన జి. వెంకటరమణ(జీవీ)కుమారుడు భరత్(27) బుధవారం ఉదయం స్నేహితులతో కలసి బయటకు వెళ్ళాడని తెలిపారు. గురువారం సాయంత్రం తంబళ్లపల్లెకు సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో శవమై కనిపించాడని అన్నారు. బుధవారం సాయంత్రం బావి వద్ద స్నేహితులతో కలసి మద్యం సేవించినట్లు సమాచారం ఉందన్నారు. ఎస్ఐ లోకేష్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని బావిలో తేలుతున్న మృతదేహాన్ని వెలికి తీయించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.